ఆరు వేల కోసం హత్య

ఒంటరిగా మహిళలు ఎవరిని నమ్మి వెళ్లవద్దు

నేర నియంత్రణలో సీసీ కెమెరాలు ఎంతో కీలకం

వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి వెల్లడి

పెద్దేముల్ ఏప్రిల్ 5 : కేవలం ఆరు వేల రూపాయల కోసం హత్య చేసిన సంఘటన పెద్దేముల్ మండల కేంద్రంలో జరిగింది. ఈ నెల 2వ తేది పెద్దేముల్ మండల కేంద్రం సమీపంలో కోట్‌పల్లి కాల్వలో గుర్తు తెలియని శవం లభ్యమైన విషయం విదితమే. పెద్దేముల్ పంచాయతీ కార్యదర్శి లాలప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీస్‌లు కేసు నమోదు చేసుకొని శవాన్ని గుర్తించే ప్రయత్నంలో పురోగతి సాధించారు. యశోద కుమారుడు అశోక్ ఆ శవం తన తల్లిదేనని నిర్ధారించాడు. తన తల్లి రోజు వారీ కూలీగా పని చేయడానికి పరిగి పట్టణానికి వస్తుండేదని.. తన తల్లితో సన్నిహితంగా ఉన్న వ్యక్తులపై అనుమానం వ్యక్తం చేస్తూ పెద్దేముల్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. అశోక్‌ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు ప్రారంభించిన పోలీస్‌లు 24 గంటల్లో ఈ కేసును చేధించారు. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం యశోద రాంరెడ్డి పల్లి తండాకు చెందిన అనిత, దొమ మండలం ఉటుపల్లి గ్రామానికి చెందిన గోపాల్‌తో సన్నిహితంగా ఉండేది. ఈ కోణంలో సాంకేతిక ఆధారంగా పోలీసులు కేసుకు సంబందించిన పూర్తి వివరాలను తెలుసుకొని ఈ హత్యని బొల్ల గోపాల్ మరియు అనితలు కలిసి హత్య చేశారని అనుమానించి తమదైన శైలిలో విచారించగా వారు నేరాన్ని అంగీకరించారు.విచారణలో విస్తు పోయే విషయాలు బయటపడ్డాయి. యశోదకు అనిత రూ. 6వేలు అప్పుగా ఇచ్చింది. యశోదను తన అప్పు తీర్చమని పలుమార్లు అడిగిన కూడ ఆమె నిర్లక్ష్యంతో సమాధానం చెప్పడంతో కక్ష పెంచుకున్న అనిత బొల్ల గోపాల్‌కు ఈ విషయాన్ని తెలియజేసింది. బొల్ల గోపాల్‌తో వీరిద్దరు సన్నిహితంగా ఉండే వారని కావున గోపాల్ యశోదకు ఫోన్ చేసి నీ ఆరు వేల అప్పు విషయం మాట్లాడుదామని పరిగి బస్టాండ్ దగ్గరికి రావాలని తెలిపాడు. పరిగి బస్టాండ్ దగ్గర అప్పటికే వేచి ఉన్న గోపాల్ అనిత , యశోదలు కలిసి ఒకే బైక్ పై వికారాబాద్ పట్టణానికి వచ్చి మద్యం సేవించారు. ధారూర్ దగ్గర రాగానే గోపాల్ ఇరువురిని కొద్ది దూరంలో బైక్ పై నుండి దింపి పెట్రోల్ బంక్‌లో బైక్‌లో పెట్రోల్ పోసుకోని, ఒక ఖాళీ సీసాలో కూడ పెట్రోల్ తీసుకున్నాడు. తర్వాత ఇరువురిని బైక్‌పై ఎక్కించుకోని ధారూర్ నాగసమందర్ మీదుగా పెద్దేముల్ గ్రామ శివారుకు చేరుకున్నారు. అక్కడ కోట్‌పల్లి కాల్వ పై భాగం నిర్మానుష ప్రాంతంలో మళ్లీ మద్యం సేవించి యశోద చీర కొంగుతో గొంతు నులిమి చంపేశాడు. చనిపోయిందన్న విషయాన్ని నిర్ధారించుకున్న వారు ఆమె ఒంటి పై ఉన్న నల్లపూసల దండా, రెండు ముక్కు పోగులు , కాళ్ల కడియాలు తీసుకోని యశోద ముఖంపై తన వెంట తెచ్చుకున్న బాటిళ్ల పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఏ 1 బోల్ల గోపాల్, ఏ 2 అనితలను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ నారాయణరెడ్డి వెల్లడించారు. విచారణలో ప్రతిభ కనబరిచిన రూరల్ సీఐ నాగేష్, పెద్దేముల్ ఎస్ఐ శ్రీధర్ రెడ్డి, యాలాల ఎస్ఐ గిరి , పెద్దేముల్ ఏఎస్ఐ బక్కన్న , సిహెచ్ రమేష్ , క్రైం వింగ్ స్టాంప్ దస్తప్ప, ప్రతాప్ సింగ్, నర్సింహ, మున్నయ్య, జయంత్, మాసయ్య, రఫీక్, సాయప్ప, అశోక్‌లను ఎస్పీ నారాయణరెడ్డి అభినందించారు. ఒంటరిగా మహిళలు ఎవరిని నమ్మి వెళ్లవద్దని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని నేరనియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు.

పెండ్లికి నిరాకరించిందని వేధింపులు

బంజారా హిల్స్, ఏప్రిల్ 5: తనతో పెళ్లికి నిరాకరించిందన్న కక్షతో వైద్యురాలిని వెంటపడి వేధిస్తున్న వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదయింది. వివరాల్లోకి వెళ్తే.. సికింద్రాబాద్ ప్రాంతానికి చెందిన యువతి (26) ఎంబీబీఎస్ పూర్తి చేసి బంజారా హిల్స్ రోడ్ నంబర్.12 లోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో డాక్టరుగా పని చేస్తున్నది. తన స్నేహితురాలి సోదరుడితో పరిచయం పెంచుకున్నది. ఈ క్రమంలో తన సోదరుడిని పెళ్లి చేసుకోవాలని స్నేహితురాలు కోరగా.. కుటుంబ సభ్యులకు విషయం చెప్పగా వారు సిద్ధికి గురించి వాకబు చేశారు. అతడికి చెడు అలవాట్లు ఉన్నాయని, కొంతమంది మహిళలతో సంబంధాలు ఉన్నాయని, తేలింది. దీంతో పెళ్లి సంబంధం ఇష్టం లేదని తిరస్కరించారు. కాగా ఏడాది నుంచి యువతి వెంటపడి వేధిస్తుండడంతో పాటు ఆమె ఫోన్ లాక్కుని ఫోటోలు వీడియోలు మార్ఫింగ్‌చేసి బ్లాక్ మెయిల్ చేయడం ప్రారంభించాడు. తనను పెళ్లి చేసుకోకపోతే వాటిని తెలిసిన వారికి పంపిస్తా అంటూ బెదిరింపులకు గురిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆమె పనిచేస్తున్న ఆస్పత్రికి వెళ్లి దాడి చేయగా శనివారం బాధిత వైద్యురాలు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ప్రేమను నిరాకరించిందని ఆత్మహత్య

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 5: ప్రేమ విషయంలో ప్రియురాలు నిరాకరించడంతో ప్రియుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నల్గొండ జిల్లా గురుమూర్తి గ్రామానికి చెందిన మహేశ్వరం నాగరాజు (22) కొంతకాలం కిందట నగరానికి వలస వచ్చి జీడిమెట్ల బ్యాంకు కాలనీలో క్యాబ్ డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. కాగా ఓ అమ్మాయితో ప్రేమలో ఉండటంతో చివరకు అమ్మాయి పేమను నిరాకరించింది. దీంతో నాగరాజు శనివారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్రాష్ట్ర మహిళా ముఠా అరెస్ట్

ముగ్గురు అరెస్టు.. పరారీలో మరో ఇద్దరు

సైదాబాద్, ఏప్రిల్ 5 : ఆర్టీసీ బస్సుల్లో వృద్ధుల దృష్టి మరల్చి ఆభరణాలను తరస్కరించే అంతర్రాష్ట్ర మహిళా ముఠా సభ్యులను మాదన్నపేట పోలీసులు అరెస్టు చేశారు. నాలుగు పోలీస్ స్టేషన్ల పరిధిలో చేసిన పలు నేరాలతో వీరికి సంబంధం ఉన్నదని తెలిపిన పోలీసులు వారి వద్ద నుంచి తొమ్మిది తులాల బంగారు ఆభరణాలు, లక్ష రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. మాదన్నపేట ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరికి చెందిన మున్నియండి రమ్య (27), తిరువూరుకు చెందిన భువనేశ్వర్ మీనా (30), ఇలప్పయార్‌కు చెందిన మూతి మారి(30), అంజలి, పార్వతిలు ఒక ముఠా గా ఏర్పడి సరూర్ నగర్, కంచన్ బాగ్, మాదన్నపేట, బేగంపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు నేరాలకు పాల్పడ్డారు. మీర్ పేట ఆర్ఎన్ నగర్ ద్వారకామాయి కాలనీలో నివసించే సుబ్బలక్ష్మమ్మ (74) మార్చి 25న ఎస్బీఐ బ్యాంకులో డబ్బులు తీసుకోవడానికి కంచన్ బాగ్‌కు . బ్యాంకులో 10 వేల రూపాయలను తీసుకొని ఇంటికి వెళ్లేందుకు పిసల్‌బండలో బస్ కోసం ఎదురుచూస్తుండగా ఈ మహిళ ముఠా సభ్యులు వృద్ధురాలు వద్దకు వచ్చారు. ఆమెతో మాటలు కలిపి వివరాలన్నీ ఆరా తీసి అప్పుడే వచ్చిన కోఠి వెళ్లే బస్సు ఎక్కించారు. ముఠా సభ్యులు సైతం అదే బస్సు ఎక్కుతున్నట్లు నటించి సుబ్బలక్ష్మమ్మను మాటల్లో దింపి మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు గొలుసు లాక్కొని బస్సు దిగి వెళ్లిపోయారు. మాదన్నపేటలో వృద్ధురాలు బస్సు దిగిన తర్వాత మెడలో బంగారు గొలుసు కనిపించక పోవటంతో మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనతో పాటు మూతులకు గుడ్డలు కట్టుకుని ఎక్కిన మహిళలపై అనుమానం ఉందని ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల సాయం తో గాలించి ముగ్గురు నిందితులను శనివారం అరెస్ట్ చేశారు. 9 తులాల బంగారు ఆభరణాలు, లక్ష రూపాయలు నగదు స్వాధీనం చేసున్నారు. ముఠాలోని మరో ఇద్దరు మహిళలు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

సేంద్రియ సాగుతోనే ప్రయోజనాలు

- కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్

- శంకర్‌పల్లిలో రెండో రోజు ప్రకృతి, సేంద్రియ రైతు సమ్మేళనం

- హాజరైన చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, సుజనాచౌదరి



కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే సుజనాచౌదరి

చేవెళ్ల రూరల్, ఏప్రిల్ 5 : రైతులు సేంద్రియ (ప్రకృతి) వ్యవసాయాన్ని చేపట్టడంలో ప్రయోజనాలు అధికంగా ఉన్నాయని కేంద్ర శాస్త్ర, సాంకేతిక, భూ విజ్ఞాన శాస్త్ర శాఖ మంత్రి జితేంద్ర సింగ్ అన్నారు. శంకర్‌పల్లిలోని బద్దం సురేందర్‌రెడ్డి గార్డెన్‌లో శనివారం ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రకృతి, సేంద్రియ రైతు సమ్మేళనం కార్యక్రమం రెండో రోజు కొనసాగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యాదయ్య, సుజనా చౌదరితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. స్థానిక విత్తనమే ప్రధానంగా వ్యవసాయంలో వచ్చే సమూల మార్పులతో పాటు సేంద్రియ ఎరువులు వాడేలా రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. వ్యవసాయంలో శాస్త్రీయంగా ఆర్గానిక్ పద్ధతులు అవలంబించాలని, ఆధునిక పద్ధతిలో ముందుకు సాగుతూ ఉత్పత్తి చేసే విధంగా యువకులు ముందుకు రావాలని చెప్పారు. వ్యవసాయానికి డిగ్రీ పట్టాలు అవసరం లేదని చదువు లేని వారు కూడా సేంద్రియ వ్యవసాయం చేసి అభివృద్ధి చెందవచ్చని సూచించారు. ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి రైతు సేంద్రియ వ్యవసాయం దిశగా అడుగు వేయాల్సిన అవసరం ఉందని, రసాయన ఎరువులు వాడకం పెరిగిపోవడంతో భూసారం దెబ్బతింటుందని, భూమి ఆరోగ్యాన్ని కాపాడడానికి మన పూర్వీకులు ఆచరించిన ప్రకృతి వ్యవసాయ పద్ధతిని అనుసరించాలని అన్నారు. ప్రకృతి సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి ఏకలవ్య ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రసాయనిక ఎరువులు వాడడంతో క్యాన్సర్, లివర్ వంటి రోగాలు ఉత్పన్నం అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో గ్రామీణ వికాస్ ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు, వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

విత్తనాభివృద్ధి పరిశోధనపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

-ప్రముఖ రాజకీయ, ఆర్థిక విశ్లేషకులు మోహన్ గురుస్వామి

-అన్మాస్‌పల్లి గ్రామంలోని ఎర్త్ సెంటర్‌లో తెలంగాణ విత్తనాల పండుగ

-పాల్గొన్న పర్యావరణవేత్తలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు

సమావేశంలో మాట్లాడుతున్న ప్రముఖ రాజకీయ, ఆర్థిక విశ్లేషకులు మోహన్ గురుస్వామి

కడ్తాల్, ఏప్రిల్ 5: విత్తనాభివృద్ధిపై ఆశించిన స్థాయిలో పరిశోధనలు జరగడంలేదని, విత్తన పరిశోధనకు ప్రభుత్వం వెంటనే కేబినేట్ సబ్ కమిటీని ఏర్పాటు చేయాలని ప్రముఖ రాజకీయ, ఆర్థిక విశ్లేషకులు మోహన్ గురుస్వామి అన్నారు. కడ్తాల్ మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలో గల ఎర్త్ సెంటర్‌లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్–భారత్ బీజ్ స్వరాజ్ మంచ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన, తెలంగాణ వార్షిక విత్తనాల పండుగ శనివారం రెండవ రోజుకి చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా మోహన్ గురుస్వామి హాజరై మాట్లాడారు. రోజురోజుకి పెరుగుతున్న భూతాపంతో పుడమిపై ప్రమాద ఘంటికలు మోగుతున్నాయని తెలిపారు. వాతావరణంలో ఒక్క సెంటీగ్రేట్ ఉష్ణోగ్రత పెరిగిన్నట్లయితే 15 నుండి 20 శాతం ఆహార ఉత్పత్తి తగ్గుతుందని పేర్కొన్నారు. దీనిని నివారించడానికి దేశీయ విత్తనాలను అభివృద్ధి చేయడమే పరిష్కారమన్నారు. గడిచిన 50 ఏండ్లలో వ్యవసాయంలో గణనీయమైన మార్పులు వచ్చాయని తెలిపారు. ఇది వరకు 1,20,000ల వరి రకాల స్థానంలో... ప్రస్తుతం 3 వేల రకాల వరి విత్తనాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయన్నారు. సువాసన భరిత చిట్టి ముత్యాలాంటి వరి వంగడాలు కనుమరుగయ్యాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విత్తనాభివృద్ధితోపాటు పరిశోధనలకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. మందిరాలు, కంచ గచ్చిబౌలి, వక్ఫ్ బోర్డు లాంటి అంశాలపై ఉన్న శ్రద్ధ... రైతులు, వాతావరణం, విత్తనాల అభివృద్ధిపై లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతోపాటు వ్యవసాయ అభివృద్ధికి సీజీఆర్ సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు. ప్రపంచీకరణ కారణంగా వ్యవసాయంతోపాటు దేశీ ఆవులు తగ్గిపోయాయని పేర్కొన్నారు. తూర్పు కొండల పశువుల పాల ఉత్పత్తులతో ప్రజల ఆరోగ్యం మెరుగవుతుందన్నారు. తెలంగాణలోని భూములలో వానపాములు తగ్గడంతో భూసారం క్షీణించిందన్నారు. దీంతో పంట దిగుబడి రాక రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని వివరించారు. సీజీఆర్ సంస్థ ఆధ్వర్యంలోని విత్తనాలతో వ్యవసాయంలో విప్లవాత్మక మార్పును తీసుకవరావాలన్నారు. స్వదేశీ ఆహారంతో క్యాన్సర్, షుగర్ తదితర రోగాలకు నివారణ చేసే విధంగా సహకరం అందిస్తామని ఆయన తెలిపారు. సీజీఆర్ వ్యవస్థాపకులు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ విత్తనాల పండుగలో రైతులకు దేశీ విత్తనాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. రైతు మేలు కోసం వర్క్ షాప్‌ను ఏర్పాటు చేసిన్నట్లు ఆయన పేర్కొన్నారు. విత్తనాల పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన దేశీ విత్తనాల ప్రదర్శనను రైతులు, మేధావులు తిలకించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఐ మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి, నాయకులు పద్మారెడ్డి, వ్యవసాయ శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలు, మేధావులు, రైతులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీజీఆర్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

సంప్రదాయ విత్తనాలను కాపాడుకోవాలి

–శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

స్థానిక సంప్రదాయ విత్తనాలను కాపాడుకుంటూ, సుస్థిర వ్యవసాయన్ని కొనసాగించే పద్ధతులను అన్వేషించాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. కడ్తాల్ మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలో గల ఎర్త్ సెంటర్‌లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్–భారత్ బీజ్ స్వరాజ్ మంచ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన, తెలంగాణ వార్షిక విత్తనాల పండుగ కార్యక్రమం కొనసాగుతుంది. శనివారం సాయంత్రం శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పాల్గొన్ని మాట్లాడారు. నేటి తరం యువతకు వ్యవసాయంపై ఆసక్తిని కలిగించాలని తెలిపారు. వ్యవసాయంలో జీవనోపాధి, ఆరోగ్యం ఉన్నదని యువతకు నమ్మకం కలిగిస్తేనే... వ్యవసాయాన్ని కాపాడలమన్నారు. స్వదేశీ విత్తనం, సాగు పద్ధతులు ఎంతో మంచివని, ప్రపంచ పోటిని తట్టుకోనేలా వ్యవసాయ విధానాలను రూపొందించావలసిన అవశ్యకత ఎంతైన ఉన్నదన్నారు. అనంతరం ఎర్త్ సెంటర్ ఆవరణలో ఏర్పాటు చేసిన దేశీయ విత్తనాల స్టాల్స్‌ను ఆయన సందర్శించి, వ్యవసాయ లైబ్రరీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీజీఆర్ వ్యవస్థాపకులు లీలమ్మ, లక్ష్మారెడ్డి, ఆర్టీఐ మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి, వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డి, పబ్లిక్ పాలసీ నిపుణులు దొంతి నర్సింహారెడ్డి, వ్యవసాయ నిపుణురాలు సునంద, నాయకులు పద్మారెడ్డి, వ్యవసాయ శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలు, మేధావులు, రైతులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీజీఆర్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

అర్చకులు రంగరాజన్‌పై దాడి నిందితులకు

బెయిల్ మంజూరు

మొయినాబాద్, ఏప్రిల్05:చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దాడి కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్న వీరరాఘవరెడ్డికి, అతని బృందానికి శనివారం బెయిల్ మంజూరు అయ్యింది. వీరరాఘవరెడ్డి రామరాజ్యం ఆర్మీ పేరుతో 20 మందితో కలిసి ఫిబ్రవరి 7వ తేదిన చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్ ఇంటికి చేరుకుని దాడి చేసిన ఘటనలో వీరరాఘవరెడ్డి, అతనితో పాటు ఉన్న 20 మంది సైనికులపై మొయినాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసిన తరువాత వీరరాఘవరెడ్డిని మణికొండలోని పంచవటి కాలనీలో నివాసం ఉంటున్న తన ఇంటి నుంచి అరెస్టు రిమాండ్‌కు తరలించారు.అర్చకునిపై దాడి కేసులో ప్రధాననిందితుడు వీరరాఘవరెడ్డితో పాటు మరో 20 మందికి జైలు శిక్షపడింది. రిమాండ్‌ను సవాల్ చేస్తూ వీరరాఘవరెడ్డి హైకోర్టులో పిటీషన్ వేశాడు. వారు 56 రోజుల పాటు జైలు జీవితం అనుభవించిన అనంతరం శనివారం రాజేంద్రనగర్ కోర్టులో రూ.15 వేల పూచికత్తుతో ప్రధాన నిందితుడు వీరరాఘవరెడ్డి శనివారం బెయిల్ మంజూరు కాగా, మిగతా 20 మందికి నెలముందే బెయిల్ మంజూరు చేసింది.

శోభాయాత్రకు భారీ బందోబస్తు

సిటీబ్యూరో, ఏప్రిల్ 5(నమస్తే తెలంగాణ): శ్రీరామనవమిని పురస్కరించుకుని ఆదివారం హైదరాబాద్‌లో జరిగే శోభయాత్రకు హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. సుమారు 20వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు. యాత్రలో షీటీమ్స్, సీసీఎస్, టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో నిఘా ఏర్పాటు చేశామని వారు పేర్కొన్నారు. శోభయాత్రను డ్రోన్‌లు, సీసీ కెమెరాలతో కమాండ్ కంట్రోల్‌రూమ్ నుంచి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతలు పరిరక్షిస్తూ శోభాయాత్ర ప్రశాంతంగా జరిగేలా చూస్తామని, ఇందుకు ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు. కోఠి వరకు శోభాయాత్ర చేరిన తర్వాత పబ్లిక్ మీటింగ్ పూర్తి చేసుకోవాలని, ఎక్కడా రెచ్చగొట్టే ప్రసంగాలు చేయకూడదని పోలీసులు పేర్కొన్నారు.

గంజాయి పట్టివేత..

సిటీబ్యూరో, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): గంజాయి తరలిస్తున్న ఆటోను గాంధీ వైద్యశాల మెట్రో స్టేషన్ వద్ద పట్టుకుని, అందులో ఉన్న 1.200కిలోల గంజాయిని సీజ్ చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ చంద్రశేఖర్ గౌడ్ కథనం మేరకు.. ఎండీ సమీర్, కుశాల్ శనివారం ఆటోలో గంజాయి తరలిస్తున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు గాంధీ మెట్రో స్టేషన్ వద్ద వారిని పట్టుకుని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 1,200 కేజీల గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్‌లు, ఆటోను సీజ్ చేశారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

హెచ్‌సీయూ విద్యార్థుల ప్రతిఘటన

పోలీసులు క్యాంపస్ వదిలి వెళ్లాలని డిమాండ్..భూములపై అడ్మిన్ హైకోర్టులో అడ్మిన్ పిల్ వేయాలని వినతి

డిమాండ్లు నెరవేర్చాలని క్యాంపస్‌లో భారీ ర్యాలీ

సిటీ బ్యూరో, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థులు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ప్రతిఘటన ర్యాలీ నిర్వహించారు. యూనివర్సిటీ పరిధిలోని 400 ఎకరాల్లో రేవంత్‌రెడ్డి సర్కార్ చేపట్టిన విధ్వంస కాండను నిలిపివేసి, హెచ్‌సీయూను ఖాళీ చేయాలని సుప్రీం కోర్టు స్టే ఇచ్చినా నిర్బంధం కొనసాగించడంపై విద్యార్థులు ఆగ్రహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నార్త్ షాపింగ్ కాంప్లక్స్ నుంచి ఈస్ట్ క్యాంపస్ ద్వారా వందలాది మంది విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. యూనివర్సిటీ భూములను కాపాడాలంటూ చేపట్టిన ఆందోళనల్లో అక్రమంగా అరెస్ట్ చేసి కస్టడీలో ఉంచిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై అక్రమంగా పెట్టిన కేసులను వెంటనే భేషరతుగా కొట్టేయాలని కోరారు. క్యాంపస్‌లో ఉన్న వందలాది మంది పోలీసులను వెనక్కి పంపించాలని డిమాండ్ చేశారు. పనులు నిలిపేసిన తర్వాత పోలీసులకు క్యాంపస్‌లో ఏం పని అంటూ ప్రశ్నించారు. కోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా యూనివర్సిటీలో నిర్బంధాలు కొనసాగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. హెచ్‌సీయూ అడ్మినిస్ట్రేషన్ విభాగం హెచ్‌సీయూ భూముల పరిరక్షణకు సహకరించాలని విద్యార్థులు కోరారు. యూనివర్సిటీ పరిధిలోని మొత్తం భూములకు యాజమాన్య హక్కులు సాధించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వంతో పోరాడాలన్నారు. భూములన్నీ హెచ్‌సీయూ పేరిట రిజిస్ట్రేషన్ చేయించేలా ఆదేశాలివ్వాలని హైకోర్టులు పిల్ దాఖలు చేయాలని డిమాండ్ చేశారు.

ఫోన్లపై నిఘా!

వర్సిటీ విద్యార్థుల ఫోన్లపై కాంగ్రెస్ సర్కార్ నిఘా ఉంచిందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఐదు రోజుల పాటు యూనివర్సిటీ భూముల్లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సృష్టించిన విధ్వంసకాండను బయటి వారికి చేరవేస్తున్నారనే నెపంతో తమ ఫోన్ సంభాషణలు వింటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులను దేశద్రోహులు, ఉగ్రవాదుల్లా చూస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిరసన తెలుపుతున్న హెచ్‌సీయూ విద్యార్థులు

860 సీసీ కెమెరాలు ప్రారంభం



సిటీబ్యూరో, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): సమాజానికి భద్రత కల్పించడంతో పాటు నేర నివారణ, నేర పరిశోధనలో సీసీ కెమెరాల కీలక పాత్ర పోషిస్తున్నట్లు రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు అన్నారు. శనివారం కమిషనరేట్ పరిధిలోని ఎల్బీనగర్ జోన్ పరిధిలోని పలు కాలనీలు, గ్రామాలు, దేవాలయాల వద్ద ఏర్పాటు చేసిన 860 సీసీ కెమెరాలను సీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ సుధీర్ బాబు మాట్లాడుతూ రూ.79.32లక్షల వ్యయంతో ఎల్బీనగర్ జోన్ పరిధిలోని 14కాలనీలు, 14గ్రామాలలో 380సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, మిగిలిన మరో 480సీసీ కెమెరాలను స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా 119 సమస్యాత్మకమైన దేవాలయాల్లో ఏర్పాటు చేశామన్నారు. ఈ సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు గ్రామ పెద్దలు ముందుకు రావాలని సీపీ విజ్ఞప్తి చేశారు. సీసీకెమెరాల ఏర్పాటులో ముందుకు వచ్చిన కాలనీల పెద్దలను ఈ సందర్భంగా సీపీ ఘనంగా సన్మానించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ డీసీపీ వి.అరవింద్ బాబు, ఎస్బీ డీసీపీ నర్సింహారెడ్డి, ట్రాఫిక్ డీసీపీ వి.శ్రీనివాసులు, ఐటీసెల్ ఏసీపీ జె.నరేందర్‌గౌడ్, ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, వనస్థలిపురం ఏసీపీ కాసిరెడ్డితో పాటు పలువురు ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

నగరంలో డ్రగ్స్ దందా.. ఇద్దరి అరెస్ట్

సిటీబ్యూరో, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): ముంబాయి కేంద్రంగా నగరంలో డ్రగ్స్ దందా నడుపుతున్న ఇద్దరు నేరగాళ్లను ఆబ్కారీ ఎస్‌టీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.2.75లక్షల విలువ చేసే 21గ్రాముల ఓజీ కుష్, 32.5 గ్రాముల చెరస్, 56 గ్రాముల ఎల్.ఎస్.డి బ్లాస్ట్‌లతో పాటు లక్ష రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌టీఎఫ్ ఈఎస్ అంజిరెడ్డి కథనం ప్రకారం...బేగంపేట ప్రాంతానికి చెందిన తేజస్ కట్ట(29) అమెరికా పౌరసత్వం కలిగి ఉన్నాడు. భారత్‌కు వచ్చి కొంతకాలం ముంబాయిలో ఉంటూ అక్కడే ఉద్యోగం చేశాడు. ఈ క్రమంలో తేజస్‌కు పలువురు డ్రగ్స్ వ్యాపారులతో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో తొలుత డ్రగ్స్‌కు బానిసగా మారిన నిందితుడు ఆ తరువాత డబ్బుకోసం డ్రగ్స్ వ్యాపారాన్ని ప్రారంభించాడు. ఈ క్రమంలో నగరానికి వచ్చిన తేజస్ కట్ట బేగంపేటలో నివాసముంటున్న రీగాక్స్ అనే కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో నగరానికి చెందిన సోహెల్ అహ్మద్(29)తో అతడికి పరిచయం ఏర్పడింది. ఇద్దరూ కలిసి డ్రగ్స్ తీసుకోవడమే కాకుండా డ్రగ్స్ వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నారు. ప్రతి15 రోజులకు ఒకసారి, ఇద్దరు కలిసి ముంబైకి వెళ్లి చెరస్, ఎల్ఎస్‌డి బ్లాస్ట్, ఓజీ కుష్ ను తీసుకొచ్చి సన్‌సిటీలో అమ్మకాలు సాగిస్తున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఎస్‌టీఫ్ పోలీసులు శనివారం నిందితులిద్దరిని పట్టుకుని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 2.75 లక్షల విలువ చేసే 21 గ్రాములు ఓజీ కుష్, 32.5 గ్రాములు చెరస్, 56 గ్రాముల ఎల్ఎస్‌డీ బ్లాస్ట్‌లతో పాటు లక్షరూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ పట్టుకున్న సిబ్బందిని ఆబ్కారీ ఈడీ కమలాసన్‌రెడ్డి అభినందించారు.

కొత్వాల్ గూడకే దిక్కు లేదు.. హెచ్‌సీయూలో ఎకో పార్కా?

ఏడాదిన్నరగా పూర్తి కానీ నిర్మాణ పనులు

వరల్డ్ క్లాస్ ఎకో టూరిజం పార్క్‌గా డెవలప్ చేసిన బీఆర్ఎస్

ఎన్నికలతో నిలిచిన ప్రాజెక్టు

హెచ్ఎండీఏ పెండింగ్ పనులను ఇప్పటికీ సమీక్షించని సీఎం రేవంత్

సిటీబ్యూరో, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ) : దేశవ్యాప్తంగా వివాదాస్పదమైన హెచ్‌సీయూ భూముల్లో సింగపూర్ తరహా ఎకో పార్క్ నిర్మిస్తామంటూ ప్రభుత్వం చెబుతున్న మాటలు హాస్యాస్పదంగా మారాయి. 2వేల ఎకరాల్లో ఎకో టూరిజం పార్క్, నైట్ సఫారీ డెవలప్ చేస్తామంటూ చెబుతోంది. కానీ ఎప్పుడో అందుబాటులోకి రావాల్సిన కొత్వాల్ గూడ ఎకో పార్క్ పెండింగ్ పనులను పూర్తి చేయడంపై దృష్టి పెట్టడం లేదు. సీఎం రేవంత్ రెడ్డి పోర్ట్‌ఫోలియోలో ఉన్న హెచ్ఎండీఏ పెండింగ్ పనులపై ఇప్పటి వరకు ఒక్కసారి సమీక్షించి, వరల్డ్ టూరిజాన్ని ప్రోత్సాహించే కొత్వాల్ గూడ ఎకో పార్క్ పెండింగ్ పనులను మాత్రం పూర్తి చేస్తామని ప్రకటించకపోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

స్వయంగా ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న మున్సిపల్ శాఖ ఆధీనంలో ఉన్న హెచ్ఎండీఏలో 90శాతం పనులు పూర్తయిన కొత్వాల్ గూడ ఎకో పార్క్‌ను ఇప్పటికీ పూర్తి చేయడం లేదు కానీ... కొత్తగా వివాదాస్పదమైన హెచ్‌సీయూలోని 2వేల ఎకరాల భూముల్లో ఎకో టూరిజం పార్క్ నిర్మిస్తామని ఊరిస్తోంది. కేవలం పెండింగ్ పనులను పూర్తి చేస్తే నగరవాసులకు వరల్డ్ క్లాస్ టూరిజం పార్క్ అందుబాటులోకి వస్తుందని తెలిసినా... ఆ పనులను పూర్తి చేయడంపై దృష్టి పెట్టడం లేదు.

పెండింగ్‌లోనే కొత్వాల్‌గూడ పార్క్..

ఏడాదిన్నర కాలంగా కొత్వాల్‌గూడ ఎకో పార్క్ అభివృద్ధి పనులన్నీ అటకెక్కాయి. దాదాపు 125 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ పార్కులో గత ప్రభుత్వం 75 శాతానికి పైగా పనులు చేపట్టింది. దాదాపు 25శాతం పనులు పెండింగ్‌లో ఉండగా... ఎన్నికల కారణంగా నిలిచిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిన్నర కావస్తున్నా.. ప్రభుత్వం కనీసం ఒక్క సమీక్ష కూడా చేయలేదు. ఓపెన్ ఎయిర్ థియేటర్, ఎంట్రెన్స్ ఆర్చ్, ఓపెన్ ప్లాజా, అప్రోచ్ రోడ్డు, ల్యాండ్ స్కేపింగ్, గ్రీనరీ వంటి సదుపాయాలతో అధునాతన టూరిజం వేదికగా కొత్వాల్ గూడ మార్చేలా 2022లో కేసీఆర్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ప్రారంభించింది. కాంగ్రెస్ సర్కారు చేస్తున్న నిర్లక్ష్యంతో... ఎప్పుడో అందుబాటులోకి రావాల్సిన కొత్వాల్‌గూడ ఎకో పార్క్‌కు మోక్షం రావడంలేదు. జంట జలాశయాలకు సమీపంలో ఉన్న ఎకో టూరిజం పార్క్‌ను త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని నగరవాసులు కోరుతున్నారు. కానీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేస్తూ... వివాదాస్పదమైన హెచ్‌సీయూ భూముల్లో ఎకో టూరిజం పార్క్‌ను అభివృద్ధి చేస్తామని ప్రకటించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. పచ్చని పరిసరాలు, అతిపెద్ద పక్షిశాల, అక్వేరియంతోపాటుగా వినోద కేంద్రంగా మారే కొత్వాల్‌గూడ ఎకో పార్క్ అందుబాటులోకి వస్తే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వస్తుంది. ఐవరీ, అక్వేరియం, బోర్డు వాక్స్, ల్యాండ్ స్కేపింగ్, వీకెండ్ క్యాపింగ్ వంటి సదుపాయాలతో ఈ ప్రాంతానికి పర్యాటకుల తాకిడి పెరుగుతుంది.